క్లుప్తంగా

రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సంగారెడ్డి : సంగారెడ్డి పరిధి విద్యానగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాల విద్యార్థులు మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రత నియమాలు, హెల్మెట్ ధరించడం ప్రాముఖ్యతను విద్యార్థులు బుర్రకథ రూపంలో వాహనదారులకు వివరించారు. అతివేగం, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల చాలా మంది రోడ్డు ప్రమాదాలకు గురై మరణిస్తున్నారన్నారు. హెల్మెట్ ధరించే వాళ్లను విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో పోలీసులు, పాఠశాల చైర్మన్ ఆంథోనీ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుసుమ రైతుల గుర్తింపునకు శిబిరాలు



శిబిరంలో మాట్లాడుతున్న సెర్ప్ అధికారులు

నారాయణఖేడ్: మండలంలో కుసుమ పంటను సాగు చేస్తున్న రైతులను గుర్తించడం కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించినట్లు నేషనల్ మిషన్ ఆఫ్ ఎడబుల్ ఆయిల్ సీడ్స్ డీపీఎం సుధాకర్, అరుణశ్రీలు తెలిపారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం శిరీష, వ్యవసాయాధికారిణి అరుణశ్రీ, శివకుమార్, రామారావు, ఇక్రిశాట్ అధికారి వేణుగోపాల్, స్థానిక ఏపీఎం సాయిలు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న సుధాకర్

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం పట్టణ పారిశుద్ధ్య కార్మికులు జీతాలు లేక సతమతమవుతున్నారని తెలుసుకున్న స్థానిక బీజేపీ నాయకులు పూడూరు సుధాకర్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కార్మికులకు నిత్యావసర సరుకులను మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత నాలుగు నెలలుగా జీతాలు అందక కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో కార్మికులకు బాసటగా నిలవాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, వీరేశ్, ఆంజనేయులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

కబ్జాలకు పాల్పడితే చర్యలు



కమిషనర్‌కు పత్రాలు అందజేస్తున్న ఆర్‌ఐ

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం పట్టణ పరిధిలోని ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు రక్షించి మున్సిపాలిటీకి అప్పగించారు. మంగళవారం తహసీల్దార్ దేవదాసు ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ ఆక్రమణకు గురైన సర్వే నంబర్ 242, 243లోని 35 గుంటల ప్రభుత్వ భూమిని అక్రమార్కుల నుంచి రక్షించి మున్సిపాలిటీకి అప్పగించారు. వీటికి సంబంధించిన పత్రాలను కమిషనర్ కిషన్‌కు అందజేశారు. ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కమిషనర్ హెచ్చరించారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



స్క్రీనింగ్ ప్రారంభిస్తున్న గణేశ్ పటేల్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు ప్రభుత్వ డబుల్ బెడ్రూం నివాస ప్రాంగణంలో గ్రాన్యూల్స్ సంస్థ, ఏఐజీ, యుసీ బ్రెస్ట్ ఫౌండేషన్, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కొల్లూరు ఇన్‌స్పెక్టర్ గణేశ్ పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రజ్ఞా చిగురుపాటి రొమ్ము క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు.

జోగిపేట ఆస్పత్రికి రోగుల తాకిడి



జోగిపేట ఆస్పత్రిలో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులు

- ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులకు చికిత్స
- ప్రతీరోజు 400 నుంచి 600 వరకు అవుట్ పేషంట్లు
- వంద పడకల ఆస్పత్రి అయినా దొరకని బెడ్లు

జోగిపేట(అందోల్): జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అవుట్, ఇన్‌పేషంట్‌లు రోజురోజుకు పెరుగుతున్నారు. వంద పడకల ఆస్పత్రి అయినప్పటికీ పురుషులు, స్త్రీలు, చిన్న పిల్లల వార్డులు, డెలివరీ వార్డులు కిక్కిరిసిపోతున్నాయి. నాలుగైదు రోజులుగా పురుషుల ఇన్‌పేషంట్ల వార్డులో 53 వరకు బెడ్లు ఉండగా 68 మంది ఇన్‌పేషంట్లు చేరడంతో ఒక్కొక్క బెడ్‌పై ఇద్దరి చొప్పున రోగులు చికిత్సలు పొందుతున్నారు. ఆస్పత్రిలో అన్ని విభాగాలకు చెందిన డాక్టర్లు అందుబాటులో ఉండటంతో రోగుల సంఖ్య విపరీతంగా పెరుగుతుంది.



ఒకే బెడ్‌పై ఇద్దరు మహిళలకు సెలైన్

ప్రతి రోజు 400 నుంచి 600 వరకు అవుట్ పేషంట్లు తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారు. ఉ. 9 గంటల నుంచే రోగులు తమ పేర్లు నమోదు చేసుకునేందుకు బారులు తీరుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ఆస్పత్రి కిటకిటలాడుతుంది. గైనకాలజిస్టు, ఆర్థోపెడిక్, జనరల్ ఫిజిషియన్ వంటి డాక్టర్ల వద్దకు రోగులు ఎక్కువగా వస్తున్నట్లు సమాచారం.



పేరు నమోదు కోసం బారులుతీరిన పేషంట్లు

అవుట్ పేషంట్‌లు పెరుగుతున్నారు

జోగిపేట ఏరియా ఆస్పత్రిలో అవుట్ పేషంట్‌ల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. డాక్టర్లు కూడా అందుబాటులో ఉండి సేవలను అందిస్తున్నారు. ఒక్కోసారి ఇన్‌పేషంట్‌ల సంఖ్య కూడా పెరుగుతుంది. ఒక్కోరోజు అవుట్ పేషెంట్‌లు 700 వరకు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. మందుల కొరత లేదు. పరిసరాల పరిశుభ్రత విషయంలో కూడా చర్యలు తీసుకుంటున్నాం.

–సౌజన్య, ఆస్పత్రి సూపరింటెండెంట్, జోగిపేట

ఒక్క బెడ్‌పై ఇద్దరికి సెలైన్...

ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో సైతం ఒకే బెడ్‌పై ఇద్దరికి చికిత్సలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంగళవారం ఈ వార్డులో ఇద్దరు మహిళలు వైరల్ ఫీవర్ కారణంగా ఒకే బెడ్‌పై సెలైన్ బాటిల్‌ల ద్వారా ట్రీట్‌మెంట్ అందించారు.

గోవింద్‌పూర్‌లో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

జహీరాబాద్ టౌన్: మండలంలోని గోవింద్‌పూర్ గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శీతాకాలం శిబిరాన్ని మంగళవారం ప్రిన్సిపాల్ అస్లాం ఫారూఖీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాల వల్ల విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెరుగుతుందన్నారు. అనంతరం ప్రోగ్రాం ఆఫీసర్ ఆధ్వర్యంలో వలంటీర్లు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రాంతంలో మొక్కలను నాటారు. ఈ నెల 19 వరకు కొనసాగే శిబిరంలో వలంటీర్లు శ్రమదానం పనులు, సామాజిక అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లచ్చయ్య, అధ్యాపకులు రాములు, సురేందర్, పంచాయతీ కార్యదర్శి సరస్వతీ, పాఠశాల హెచ్‌ఎం. దేవిసింగ్‌రాథోడ్‌లు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

పఠన నైపుణ్యం పెంపొందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

పటాన్‌చెరు టౌన్: విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి నుంచి పఠన నైపుణ్యం పెంపొందించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో కూర్చుని పాఠాలు విన్నారు. విద్యార్థులు చదవడం, రాయడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమికస్థాయిలో విద్యార్థులు చదవడం, రాయడం, అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో స్వతంత్ర పాఠకులుగా మారుతారని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల, విద్యార్థులు పాల్గొన్నారు.

సమయానుకూలంగా బస్సులు నడపండి

జహీరాబాద్: పాఠశాలలు, కళాశాలల సమయానికి అనుగుణంగా ఎల్గోయి గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడపాలని ఏబీవీపీ నాయకులు అధికారులను కోరారు. మంగళవారం ఏబీవీపీ మెదక్ విభాగ్ సంఘటన మంత్రి బోడ లక్ష్మణ్ ఆధ్వర్యంలో విద్యార్థులు డిపో మేనేజర్ స్వామికి వినతిపత్రం అందజేశారు. ఎల్గోయి నుంచి ఉ. 8 గంటలకు, సా. జహీరాబాద్ నుంచి 4.30 గంటలకు బస్సులు బయలుదేరేలా చూడాలని కోరారు. ఉదయం పూట సమయానికి బస్సులు రాక పోవడంతో రెండు మూడు క్లాసులు మిస్ అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు డీఎం సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు శశికాంత్, మల్లేశ్, సంగమేశ్, హారిక, అఖిల, మనుష పాల్గొన్నారు.



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ **రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక**

జహీరాబాద్: కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి ప్రదీప్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి ప్రదీప్ అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సంపాదించాడు. ఇటీవల పటాన్‌చెరులో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ ఎంపిక శిబిరంలో పాల్గొని ఎంపికయ్యాడు. మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు ప్రదీప్‌ను అభినందించారు.

◆ **సమస్యలు పరిష్కరించండి**

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పార్టీ పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు సంబంధిత అధికారులను కోరారు. పట్టణంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ మంగళవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ కార్యాలయంలో ఈఈకి వినతి పత్రం అందజేశారు.

◆ **రామచంద్రాపురం తహసీల్దార్‌గా సరస్వతి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం తహసీల్దార్‌గా సరస్వతిని నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆమె ఉద్యోగ బాధ్యతలు చేపట్టనున్నారు.

◆ **అంబేడ్కర్ విగ్రహానికి నివాళి**

జోగిపేట(అందోల్): 1956 డిసెంబర్ 10న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ బౌద్ధ మతాన్ని స్వీకరించిన సందర్భంగా మంగళవారం జోగిపేటలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. నాగపూర్ పట్టణంలో ఆరు లక్షల మంది సమక్షంలో బౌద్ధ మతాన్ని ఆయన స్వీకరించారన్నారు. కులమతాలకు సంబంధం లేకుండా మనుషులందరూ సమానమని అన్నారు. రాబోయే రోజుల్లో బౌద్ధమతాన్ని విస్తృతంగా ప్రచారం చేసి ప్రతి గ్రామంలో బౌద్ధం బహుజనులందరినీ ఐక్యం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పోచయ్య, రాజు, మహేశ్ , పరిపూర్ణ, పద్మారావు, కుమార్ పాల్గొన్నారు.

◆ **వాలీబాల్ పోటీలు ప్రారంభం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ కాలనీలో కమ్యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భెల్ ఇంటర్ యూనిట్ వాలీబాల్ క్రీడాపోటీలను మంగళవారం భెల్ ఈడీ కే.బి.రాజా, పీఈఎస్‌డీ యూనిట్ ఈడీ శ్రీనివాస్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో దేశంలోని పలు యూనిట్‌లకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

◆ **కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. మండలంలో 8 ఉన్నత పాఠశాలలతో పాటు ఒక కేజీబీవీ ఉంది. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇటీవల పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించింది. రోజు సాయంత్రం 4.15 నుంచి 5.15 గంటల వరకు తరగతులు కొనసాగుతున్నాయి.

బ్యాంక్, పోస్టల్ సేవలపై అవగాహన

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం బ్యాంక్, పోస్టల్ సేవలపై అవగాహన కల్పించారు. మంగళవారం విద్యార్థులు స్థానిక ఎస్‌బీఐ, పోస్టాఫీస్‌ను సందర్శించారు. బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు, బీపీఎం కవిత విద్యార్థులకు బ్యాంక్, పోస్టల్ సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరం శ్రీనివాస్, టీచర్లు వరప్రకాశ్, సచిన్, రవికుమార్ పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: తెలంగాణ మున్సిపల్ యాక్ట్ 2019 ప్రకారమే మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణాలు చేపట్టాలని ఇంద్రేశం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత తేదీల్లో ఉన్న గ్రామ పంచాయతీల అనుమతితో నిర్మాణాలు చేపట్టవద్దన్నారు. మున్సిపాలిటీ అనుమతి పొందిన అనంతరం నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. ఇప్పటికే నిర్మించిన అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేశామని తెలిపారు.

వేగంగా ఇళ్లు పూర్తి చేయాలి

సంగారెడ్డి టౌన్: మండలంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని సంగారెడ్డి ఎంపీడీఓ యాదగిరి అన్నారు. మంగళవారం మండలంలోని పసల్వాది గ్రామంలో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తొమ్మిది మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం..సోమవారం నిర్వహించిన తనిఖీల్లో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా ఏడుగురికి రూ. వెయ్యి, మరో వ్యక్తికి రూ.2 వేలు, ఒకరికి రూ.500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

న్యాయం చేయాలని వినతి



పద్మజారాణికి వినతిపత్రం ఇస్తున్న బాధితులు

సంగారెడ్డి జోన్: కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు తమ ఇళ్లు, ప్లాట్లను ధ్వంసం చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మజారాణికి ఐడీఎస్‌ఎంటీ కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జహీరాబాద్ పట్టణంలో ఇల్లు, ప్లాట్లు లేని వారికి 1982 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ప్లాట్లు ఇచ్చింది. కొంతమంది ఇళ్లను నిర్మించుకోగా మరి కొందరు అలాగే ఉంచారు. ప్రైవేట్ వ్యక్తులు జేసీబీలతో ఇళ్లు, ప్లాట్లను ధ్వంసం చేస్తున్నారని వాపోయారు. 25 సంవత్సరాల నుంచి ఇక్కడ నివసిస్తున్నామన్నారు. స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదని, తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు నామ రవికిరణ్, వెంకటేశం, నర్సింహ్మారెడ్డి, వెంకట్‌సాగర్ ఉన్నారు.

నీటి సమస్యపై ఆందోళన

నారాయణఖేడ్: పట్టణంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై మంగళవారం పట్టణవాసులు, బీఆర్‌ఎస్ నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన పలు కాలనీవాసులతో పాటు మన్సూర్‌పూర్ వాసులు మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి నీటి ఎద్దడిపై అధికారులతో వాగ్వాదానికి దిగారు. కొన్ని రోజుల నుంచి నీటి సరఫరా ఇబ్బందిగా మారిందని, ట్యాంకర్ల ద్వారా సక్రమంగా నీటిని అందించడం లేదని మండిపడ్డారు. వర్షాకాలంలోనూ తాగునీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. ముఖ్యంగా మంగల్‌పేట్‌లో సమస్య మరింత తీవ్రంగా ఉందని వాపోయారు. నీటిసరఫరా విభాగం ఇన్‌చార్జి శ్రావణ్, ట్యాంకర్ల ఇన్‌చార్జిపై కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సక్రమంగా నీటిని అందించని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న పట్టణవాసులు

గంజాయి సాగు చేస్తే జైలుకు పంపుతాం



పత్తి చేలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సీఐ డి.వెంకట్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): అక్రమంగా గంజాయి సాగు చేసిన, రవాణా చేసిన వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని కంగ్టి సీఐ డి.వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సిర్గాపూర్ మండలం పటేల్ తండా, గైర్హాన్ తండాలో పత్తి చేలను పరిశీలించారు. గంజాయి సాగు చేస్తున్నారా? అనే కోణంలో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించారు. గంజాయి సాగు, రవాణా చేసిన ప్రభుత్వ పథకాలు కట్ చేస్తామని తెలిపారు. కొత్త చట్టం ప్రకారం ఆస్తులు ప్రభుత్వానికి అటాచ్ చేయనున్నట్లు వివరించారు. ఎవరైనా గంజాయి సాగు చేస్తే సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహేశ్‌కుమార్ పాల్గొన్నారు.

వానాకాలం సాగుకు అనువైన వరి రకాలు

రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా.కె.అరుణ, డా.ఎ.నిర్మల

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలంలోని సంగుపేట్ గ్రామంలో వరి చిరు సంచుల రకాలను తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం(ఏరువాక కేంద్రం)శాస్త్రవేత్తలు డా.కే.అరుణ, డా.ఎ. నిర్మల పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వరి పంటలో ప్రస్తుతం చిరు సంచుల ప్రయోగ దశలో ఉన్న కునారం పరిశోధన స్థానం నుంచి కెఎన్‌ఎం- 12472 వరి రకాన్ని పరిశీలించారు. ఈ రకం వరిధాన్యం సన్నగా ఉండి దీర్ఘ కాలంలో కోతకు రావడంతో పాటు ఎకరాకు 26-30 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని తెలియజేశారు. కంపసాగర్ నుంచి కేపీఎస్-10329 అనే రకం దొడ్డు గింజ రకం.. ఈ రకం పంటకాలం 120 రోజులు కలిగి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, ఆనందం, యంగ్ ప్రొఫెషనల్ - 1 కె. ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.



వరి రకాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజల మనిషి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

సంగారెడ్డి: నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌పై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సంగారెడ్డి పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. సంగారెడ్డి, కంది, కొండాపూర్ మండలాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌పై అసత్య ప్రచారం జరుగుతుందని ఆరోపించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై నిరంతరం స్పందించేది ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సదాశివపేటలోని నివాసం, సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతిరోజు ప్రజలను కలుస్తూనే ఉంటారన్నారు.అలాంటి వ్యక్తిపై దుష్పచారం చేసే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

సంక్షేమానికి కట్టుబడి ఉన్నా..

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గంలో ముదిరాజ్‌ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహగౌడ్ తన తండ్రి నందారం మల్లయ్యగౌడ్ జ్ఞాపకార్థం సొంత నిధులతో నిర్మించిన ముదిరాజ్ మహిళా భవనాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ముదిరాజ్‌లకు సముచిత ప్రాధాన్యం అందిస్తున్నామన్నారు. తండ్రి జ్ఞాపకార్థం భవనాన్ని నిర్మించడంపై నరసింహగౌడ్‌ని అభినందించారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న మహిపాల్ రెడ్డి

పరిశ్రమకు అధికారిక గుర్తింపు



సంబరాల్లో పరిశ్రమ ప్రతినిధులు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని అపటోరియా (అరబిందో) ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు అధికారిక గుర్తింపు లభించింది. ఈ మేరకు మంగళవారం పరిశ్రమ యజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది. అపటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ గ్రేట్ ప్లేస్ టు వర్క్‌గా అధికారిక గుర్తింపు పొందడంపై పరిశ్రమలోని సిబ్బంది కార్మికులు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారని పేర్కొన్నారు. పరిశ్రమ ఈ మైలురాయిని సాధించడం అద్భుత విజయంగా భావిస్తూ ఎంపిక చేసిన సంస్థ నిర్వాహకులకు పరిశ్రమ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ జీఎంలు, హెచ్‌ఆర్ ప్రతినిధులు కార్మికులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి

సైన్స్ జిల్లా అధికారి సిద్ధారెడ్డి

కంది(సంగారెడ్డి): విద్యార్థులందరూ శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని సైన్స్ జిల్లా అధికారి సిద్ధారెడ్డి సూచించారు. మండల పరిధిలోని చేర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సంచార విజ్ఞాన ప్రయోగశాల ద్వారా విద్యార్థులకు బయాలజీ, కెమిస్ట్రీ, గణిత శాస్త్రంలో పరికరాలతో బోధించారు. ఈ సందర్భంగా సిద్ధారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులందరికీ సైన్స్‌పై పట్టు వచ్చేలా ఒక్కో పాఠశాలలో ఒక్కో రోజు సంచార విజ్ఞాన ప్రయోగశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ విద్యార్థిలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రాజయ్య, రిసోర్స్ పర్సన్‌లు వెంకటేశ్,రాజు, లక్ష్మయ్య, శ్రీలక్ష్మి,నజీర్‌తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పిస్తున్న సిద్ధారెడ్డి

ఇంటింటా పోలియో చుక్కలు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలో ఇంటింటా పిల్లలకు పల్స్ పోలియో చుక్కల మందు వేసినట్లు కల్హేర్ పీహెచ్‌సీ డాక్టర్ జెబా శాహేమిన్ మంగళవారం తెలిపారు. ఐదేళ్ల లోపు 2,468 మంది పిల్లలకు చుక్కల మందు వేయడం లక్ష్యంగా కార్యక్రమం పూర్తి చేశామని తెలిపారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ప్రతి ఇంటికి తిరిగి సర్వే చేశారని చెప్పారు.